శూన్య మాసాన పండుగలకు శ్రీకారం

- పుట్టింటికి చేరుకున్న కొత్త కోడళ్లు
- శుభకార్యాలకు మాత్రమే బ్రేక్
- ఆషాఢ మాసం ప్రారంభం



మహిళల చేతులకు శోభ తెచ్చిన గోరింటాకు

రాయవరం: తెలుగు మాసాల్లో నాల్గోదైన ఆషాఢ మాసం శనివారం ప్రారంభమైంది. ఎలాంటి శుభ కార్యాలు తలపెట్టకున్నా.. ఈ మాసానికి అనేక విశిష్టతలు ఉన్నాయి. కొత్తగా పెళ్లయిన వధు వులు పుట్టింటికి చేరుకుంటారు. కొత్త అల్లుళ్లను అత్తవారింట అడుగు పెట్టనివ్వరు. పూర్వాషాఢ నక్షత్రంలో కూడిన పౌర్ణమి ఉన్న నెలయే ఆషాఢ మాసం. పౌర్ణమి రోజున చంద్రుడు ఉత్తరాషాఢ /పూర్వాషాఢ నక్షత్రాల మధ్యలో ఉండడం వల్ల వచ్చే నెలగా తెలియజేస్తారు. ఉత్తరాయణ పుణ్యకా లం పూర్తయి సూర్యుడు మిధునరాశి నుంచి కర్కాటకరాశిలోకి ప్రవేశించడంతో దక్షిణాయణం మొదలవుతుంది. దక్షిణాయణం ప్రారంభమైన మాసం కనుక ఆషాఢం శూన్యమాసం. శూన్య మాసంగా వ్యవహరించినప్పటికీ ఈ మాసంలో వచ్చే తొలి ఏకాదశితోనే పండగలు ప్రారంభమవుతాయి. జూలై 6న ప్రారంభమైన ఆషాఢం ఆగస్టు 5తో ముగుస్తుంది.

శూన్యమాసం

ఆషాఢంలో వర్షాలు కురుస్తాయని, వ్యాధులు ప్రబలుతాయనే ఉద్దేశంతో ఎలాంటి శుభకార్యాలు తలపెట్టరు. ఈ మాసంలో వివాహాలు, నిశ్చితార్థాలు, గృహ ప్రవేశాలు, వేడుకలు నిర్వహించరు. భక్తులు చాతుర్మాస వ్రతాలు ఆచరిస్తారు. పూరీ జగన్నాథ రథయాత్ర, కుసుమహార జయంతి, సంకటహర చతుర్థి వంటి పండగలను ఈ నెలలోనే జరుపుకుంటారు. శుభకార్యాలు నిర్వహించనప్పటికీ ఈ నెలలో దేవతారాధనలు, శక్తి ఆరాధనలు చేస్తారు.

గోరింట మెరుపులు

ఆషాఢ మాసంలో మహిళలు గోరింటాకు ధరించడం ఆనవాయితీగా వస్తోంది. గ్రీష్మ రుతువు అనంతరం వర్ష రుతువులో ఆషాఢం వస్తుంది. ఈ సమయంలో గ్రీష్మ రుతువులో మన శరీరం వేడితో కూడుకుని ఉంటుంది. ఆషాఢంలో బయటి వాతావరణం చల్లబడుతుంది. ఈ కారణంగా గోరింటను అరచేతుల్లో ధరిస్తే శరీరంలోని వేడి బయట చల్లబడిన వాతావరణానికి విరుద్ధంగా తయారవుతుంది. చర్మ సమస్యలు కూడా దరి చేరవు. గోరింటాకు శరీరంలో ఉండే వేడిని తగ్గించే శక్తిని కలిగి ఉండడంతో పాటు రోగ నిరోధక శక్తిని సైతం పెంచుతుంది.

పర్వదినాలు ప్రారంభం

ఆషాఢం అనే పదం 'అది' అనే సంస్కృత పదం నుంచి పుట్టింది. అది అనగా శక్తి అనే అర్థాన్ని ఇస్తుంది. కావున ఆషాఢంలో దేవతలను పూజించడం పవిత్ర కార్యమని భక్తుల నమ్మిక. ప్రముఖ పూరీ జగన్నాథుని రథయాత్ర సైతం ఆషాఢంలోనే జరపడం విశేషం. అందుకే ఈ నెలలో ఆలయాలు భక్తులతో రద్దీగా ఉంటాయి. తొలి ఏకాదశి నుంచి పండగలు మొదలవుతాయి. ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజున మహావిష్ణువు పాలకడలిపై యోగనిద్రలోకి వెళ్లే సందర్భాన్ని తొలి ఏకాదశిగా వ్యవహరిస్తారు. ఆషాఢ శుద్ధపౌర్ణమి రోజున గురుపౌర్ణమిగా పరిగణిస్తారు.

మహిళలకు ప్రత్యేకం



"గోరింటాకు పెట్టుకోవడం మహిళలకు అమితమైన ఇష్టం. మహిళలందరం కలిసి ఆషాఢంలో గోరింటాకు పెట్టుకుంటాం. దీనివల్ల చర్మ సౌందర్యంతో అనేక ప్రయోజనాలు ఉంటాయి. పూర్వీకుల నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతోంది.

– జీఆర్‌కే వేణి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, రాయవరం

ఆధ్యాత్మికతకు నెలవు



ఆషాఢమాసం ఆధ్యాత్మికతకు నెలవు. ఈ మాసంలోనే ప్రత్యేక పర్వదినాలు ప్రారంభమవుతాయి. తొలి ఏకాదశి పర్వదినాన్ని ఘనంగా జరుపుకొంటాం. ఈ పర్వదినంతోనే పర్వదినాలు ప్రారంభమవుతాయి.

– కొండపల్లి లలిత, ప్రభుత్వ ఉద్యోగిని, వేగాయమ్మపేట, రామచంద్రపురం మండలం"

అత్తారింటి నుంచి పుట్టింటికి..

కొత్తగా పెళ్లయిన వధువులు ఆషాఢంలో అత్తారింటి నుంచి పుట్టింటికి వెళ్తారు. ఆషాఢంలో అత్తాకోడళ్లు ఒకరినొకరు చూసుకోకూడదని సంప్రదాయబద్ధంగా వస్తోంది. కొత్తగా పెళ్లై అత్తారింట్లో అడుగిడిన అమ్మాయిలు తల్లిదండ్రులపై బెంగతో ఉంటారు. వీరు ఆషాఢంలో పుట్టింటికి వెళ్లి తోబుట్టువులు, స్నేహితురాళ్లతో కలిసి వేడుకలు జరుపుకుంటారని ప్రతీతి.

క్లుప్తంగా

నేడు మల్టీపర్పస్ యాక్టివిటీ సెంటర్‌కు భూమిపూజ

రాయవరం: మండలంలోని వెంటూరు గ్రామంలో రూ.20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించే మల్టీ పర్పస్ యాక్టివిటీ సెంటర్‌కు రాజ్యసభ సభ్యుడు పిల్లి సుబాష్‌చంద్రబోస్ ఆదివారం భూమిపూజ చేయనున్నారు. ఈ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అధ్యతన ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

బాలికా విద్య అందరి బాధ్యత



వల్లూరులో మాట్లాడుతున్న శ్రమ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

కపిలేశ్వరపురం: గ్రామీణ ప్రాంతాల్లో బాలికా విద్యను ప్రోత్సహించడం అందరి బాధ్యత అని వల్లూరు సర్పంచ్ దాసి మీనాకుమారి అన్నారు. గ్రామ సచివాలయంలో శనివారం శ్రమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలికా విద్య ప్రాధాన్యతపై సదస్సు నిర్వహించారు. సర్పంచ్ మీనాకుమారి, మహిళా పోలీస్ గెడ్డం ప్రమీల, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ చదువు మానవ జీవితంలో గొప్ప సంపద అన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి చదువులో నాణ్యతను పెంచడం ద్వారా విద్యార్థులు తమ కాళ్లపై తాము నిలబడే శక్తి సామర్థ్యాలను కలిగి ఉంటారన్నారు.

అంబేడ్కర్ విగ్రహం కూల్చిన వారిపై కఠిన చర్యలు



వెల్లలో సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల జగనన్న కాలనీలో గురువారం రాత్రి అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి కూలగొట్టిన వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణను ఆదేశించారు. మంత్రి సుభాష్ శనివారం సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. విగ్రహం కూల్చిన స్థానంలో కొత్త విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సీఐ దొరరాజు, ఎస్సై జి. సురేంద్ర, మాజీ సర్పంచ్ వట్టికూటి ఏసుబాబు, దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.


జగ్జీవన్‌రామ్‌కు ఘనంగా నివాళి



జగ్జీవన్‌రామ్‌కు నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మండపేట: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో నిర్వహించారు. స్థానిక వాణీమహల్ జంక్షన్ వద్ద గల జగజ్జీవన్ రామ్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాపిరాజు మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు మందపల్లి సుధాకర్, షేక్ అలీఖాన్‌బాబా, కొడమంచిలి భాస్కరరావు, పొలమాల సత్తిబాబు, గునిపే ఆనంద్, సుందరపు సత్తిబాబు, తాతపూడి సురేష్‌కుమార్, లంక రాజు, పెనుముచ్చి బాబూ సుకుమార్, జొన్నపల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

షిర్డీలో మున్సిపల్ డీఈ మృతి



డీఈ దుర్గాప్రసాద్ (ఫైల్)

రామచంద్రపురం: మున్సిపల్ డీఈ దుగ్గిరాల దుర్గాప్రసాద్ (59) గుండె పోటుతో శనివారం షిరిడీలో మృతి చెందారు. దైవ దర్శనం నిమిత్తం ఆయన కుటుంబ సభ్యులతో కలసి షిర్డీ వెళ్లారు. దర్శనం నిమిత్తం ఆలయంలో ఉండగానే గుండెపోటు రావటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. కాగా దుర్గాప్రసాద్ మండపేట పురపాలక సంఘం ఇన్‌చార్జ్ కమిషనర్‌గా, టౌన్ ప్లానింగ్ ఇన్‌చార్జ్‌గా, మునిసిపల్ ఏఈ గా సుదీర్ఘకాలం పనిచేశారు. పదోన్నతిపై రామచంద్రపురం డీఈగా 2022లో బదిలీ అయ్యారు. ఆయనకి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు డీఈ దుర్గాప్రసాద్ మృతికి సంతాపం తెలిపారు.

ఎరువులు, పురుగుమందుల షాపులపై విజిలెన్స్ తనిఖీలు



గొల్లపాలెం ఎరువుల షాపులో రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

కాజులూరు: మండల గ్రామాల్లోని పలు ఎరువులు, పురుగుమందుల షాపులపై శనివారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్పెషల్ కమిషనర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆదేశాల మేరకు జిల్లా అధికారి కె.త్రినాథస్వామి ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా విజిలెన్స్ అధికారి డీవీవీ సతీష్‌కుమార్ తదితర అధికారులు తనిఖీలో పాల్గొన్నారు. కాజులూరు, గొల్లపాలెం తదితర గ్రామాల్లో షాపులు తనిఖీ చేసి స్టాకు రికార్డులను, గొడౌన్లను పరిశీలించారు. రైతులు తొలకరి సాగుకు సిద్ధమౌతున్నందున ఎటువంటి తప్పిదాలకు తావులేకుండా నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు వారికి అందజేయాలని బిల్లులు, స్టాకు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని అధికారులు షాపు యజమానులకు సూచించారు. కాజులూరు, పెదపూడి మండల వ్యవసాయాధికారులు వి.అశోక్, టీవీఆర్ మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీకి నివాళి

మండపేట: జనసంఘ్ వ్యవస్థాపకుడైన శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని బీజేపీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని టౌన్ హాల్లో నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ ముఖర్జీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు మద్దుల సుబ్బారావు, బుద్ధవరపు రాజు, సీహెచ్ భాస్కరరావు పాల్గొన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని వెళ్లాలి

మండల సమావేశంలో ఎంపీ బోస్



రామచంద్రపురం మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బోస్

రామచంద్రపురం రూరల్: అన్ని శాఖల అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులైన సర్పంచ్, ఎంపీటీసీలను సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ సర్వ సభ్య సమావేశం శనివారం ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఎంపీ బోస్ పాల్గొని అధికారులు, ప్రజాప్రతినిధులకు పలు సూచనలు చేశారు. పలు శాఖల అధికారులు గ్రామాల్లో కార్యకలాపాలు నిర్వహించే క్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు కనీస సమాచారం ఇవ్వడం లేదని సమావేశం దృష్టికి తీసుకురావడంతో ఎంపీ బోస్ స్పందిస్తూ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులను ప్రతి విషయంలోనూ సమన్వయం చేసుకుంటూ వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులను కలుపుకుని వెళ్లడం వలన అనుకున్న లక్ష్యాలు కూడా త్వరగా నెరవేరతాయని సూచించారు. కాపవరం ఎంపీటీసీ రెడ్నం వీరవెంకటసత్యనారాయణ(సతీష్) మాట్లాడుతూ రామచంద్రపురం మండలాన్ని కాకినాడ జిల్లాలో కలిపే విధంగా తీర్మానం చేయాలని కోరారు. ఈ అంశంపై అందరూ సానుకూలంగా స్పందిచడంతో ఎంపీపీ భవాని తీర్మానం చేద్దామన్నారు. వేగాయమ్మపేట గ్రామ సర్పంచ్ అంబటి తుకారం మాట్లాడుతూ ఇదే అంశంపై ప్రతి గ్రామంలోనూ పంచాయతీల ద్వారా తీర్మానాలు చేయాలని కోరారు. ఎంపీ బోస్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ డ్వాక్రా సంఘాల్లో స్త్రీనిధి విషయంలో అవకతవకలు జరిగాయని దానిపై అన్ని డ్వాక్రా సంఘాలపై స్త్రీనిధి విషయంలో సంపూర్ణంగా ఆడిట్ నిర్వహించి మూడు నెలల్లో మళ్లీ సమావేశం అయినప్పటికీ పూర్తి స్థాయిలో నివేదికలను అందించాలని వెలుగు శాఖ అధికారులను ఆదేశించారు. కౌలు కార్డుల జారీ సక్రమంగా లేదని సర్పంచ్‌లు తుకారం, అనిశెట్టి రామకృష్ణ, వీరబోయిన సూరిబాబు తదితరులు సభ దృష్టికి తీసుకువచ్చారు. రైతులకు ఎరువులు సక్రమంగా అందడం లేదని వెల్ల ఎంపీటీసీ చిక్కాల స్వామికాపు తెలిపారు. ఎంపీటీసీలు గుత్తుల అచ్యుతవేణి, మంచెం దేవి, సర్పంచ్ కొత్తపల్లి అరుణ పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. అన్ని శాఖల కార్యక్రమాలను సమీక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీల నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, కోఆప్షన్ మెంబర్ షేక్ అహ్మద్ అలీషా, ఎంపీడీఓ ఎన్‌వీ రామచంద్రమూర్తి, తహసీల్దార్ మైలా వెంకటేశ్వరరావు, మండల ప్రత్యేక అధికారి రాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీవాల వ్యాధులపై అవగాహన అవసరం

కపిలేశ్వరపురం: జీవాల వ్యాధుల పట్ల వాటి సంరక్షకులకు అవగాహన అవసరమని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.వెంకట్రావు అన్నారు. ప్రపంచ జంతు వ్యాధుల దినోత్సవాన్ని మండలంలోని అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ ఆలమూరు సహాయ సంచాలకురాలు డాక్టర్ ఎల్.అనిత తదితర అధికారులు పాల్గొన్న సదస్సులో పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ జంతువుల పట్ల ప్రేమ, కరుణలను కలిగి ఉండడంతో పాటు వాటి నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై సైతం అవగాహన అవసరమన్నారు. బర్డ్ ఫ్లూ, ర్యాబిస్ వ్యాధుల తీవ్రతను వివరించారు. వాటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శాస్త్రీయంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ వీవీ రమణమూర్తి, హెచ్‌ఎం అంగర రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అంగర హైస్కూల్‌లో మాట్లాడుతున్న డాక్టర్ వెంకట్రావు

జంతువుల సంరక్షణపై అవగాహన అవసరం

కె.గంగవరం: విద్యార్థి దశ నుంచే జంతువుల సంరక్షణపై సరైన అవగాహన కలిగి ఉండాలని పశుసంవర్ధక శాఖ జిల్లా పశువైద్యుడు డాక్టర్ కె.వెంకట్రావు అన్నారు. మండలంలోని పామర్రులోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శనివారం ప్రపంచ జంతు సంక్రమిత వ్యాధుల దినోత్సవ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువులను పెంచుకోవడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు. దీంతో పాటు సంపాదన కూడా పెరుగుతుందని, మంచి పాలు, పౌష్టిక ఆహారం పొందవచ్చన్నారు. దేశవాళీ ఆవు పేడ ద్వారా ఆర్గానిక్ ఆహారం పండించడం వల్ల మార్కెట్‌లో మంచి గిట్టుబాటు ధర లభించి ఆర్థికంగా లబ్ధి పొందొచ్చన్నారు. దీంతో పాటు జునోసిస్ డే ప్రాముఖ్యత గురించి జునోటిక్ వ్యాధుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం సంక్రమిత వ్యాధులపై క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో రామచంద్రపురం ఏడీ ఒ.రామకృష్ణ ద్రాక్షారామ పశువైద్యాధికారి బిందు, పశువైద్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ద్రాక్షారామ పశు వైద్యశాల వద్ద పెంపుడు కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ కృష్ణార్జున



కె.గంగవరంలో బహుమతులు అందిస్తున్న అధికారులు

కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు

రామచంద్రపురం రూరల్: వరల్డ్ జునోసిస్ డేను పురస్కరించుకుని మండలంలోని పశు వైద్యశాలలు, పలు గ్రామాల్లో పాఠశాలలు, సచివాలయాల వద్ద శనివారం 156 పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేశారు. ద్రాక్షారామ పశు వైద్యశాల వద్ద మండల పశు వైద్యాధికారి డాక్టర్ మేడిశెట్టి కృష్ణార్జున ఆధ్వర్యంలో 24 కుక్కలకు ఉచిత రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. రామచంద్రపురం పట్టణంలోని పశు వైద్యశాల వద్ద ఏడీ డాక్టర్ ఒ.రామకృష్ణ, వెల్ల పశు వైద్యశాల వద్ద డాక్టర్ దుర్గాభవాని, గ్రామాల్లో పశు వైద్య సిబ్బంది, సహాయకులు వ్యాక్సిన్లు వేయడంతో పాటు పెంపుడు జంతువుల వలన జరిగే అనర్థాల గురించి వివరించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పెంపుడు కుక్కలు, పిల్లులు మాత్రమే కాకుండా పావురాలు, ఎలుకలు, గబ్బిలాలు, కోతులు, పందులు తదితర అన్ని రకాల మూగజీవాల వలన ఎటువంటి వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు.

ఉద్రిక్తతల మధ్య కొబ్బరి చెట్ల వేలం



పోలీసుల బందోబస్తు మధ్య వేలం నిర్వహిస్తున్న అధికారులు

కె.గంగవరం: మండలంలోని కోట సచివాలయం వద్ద శనివారం కొబ్బరిచెట్ల ఫల సాయంకు నిర్వహించిన బహిరంగ వేలం పాటలో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. పంచాయతీకి చెందిన సుమారు 325 కొబ్బరి చెట్లకు సంబంధించి గత 33 సంవత్సరాలుగా వేలం నిర్వహించడం లేదు. దీంతో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యుల బహిరంగ వేలం నిర్వహించాలని ఇటీవల తీర్మానం చేశారు. దీంతో ఈఓపీఆర్డీ నాగేంద్ర, పంచాయతీ సిబ్బంది సచివాయలం వద్ద వేలం నిర్వహించారు. గతంలో కొబ్బరిచెట్ల ఫల సాయం పొందిన లబ్ధిదారులకు, పంచాయతీ సిబ్బందికి, బహిరంగ వేలం పాటలో పాల్గొన్న పాటదారుల మధ్య తోపులాట సాగింది. సీఐ దొరరాజు ఆదేశాల మేరకు సంఘటన స్థలానికి కె.గంగవరం, అంగర స్టేషన్లకు చెందిన పోలీస్ సిబ్బంది చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. అనంతరం నిర్వహించిన వేలం కొండేపూడి వీరబాబు మూడు సంవత్సరాల కాల పరిమితికి రూ.6 లక్షల 50 హెచ్చు పాడుకున్నారు. దీంతో ఈ చెట్లకు సంబంధించి గత 33 ఏళ్లుగా పంచాయతీకి ఆదాయం సమకూరలేదు. వేలం వల్ల పంచాయితీకి ఆదాయం సమకూరిందని సర్పంచ్ మల్లిడి సుశీల చెప్పారు.

బాలాజీని దర్శించుకున్న ఆర్డీఓలు



ఆర్డీఓలకు స్వామి వారి చిత్రపటాలు అందజేస్తున్న ఈఓ మాధవి

మామిడికుదురు: కొత్తపేట, రామచంద్రపురం ఆర్డీఓలు జీవీవీ సత్యనారాయణ, ఎస్.సుధాసాగర్‌లు అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని శనివారం దర్శించుకున్నారు. ఆర్డీఓలకు అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసిన అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు తీరిన బాలబాలాజీ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం పండితుల నుంచి వేద ఆశీర్వచనం అందుకున్నారు. ఆలయ ఈఓ గ్రంధి మాధవి ఆర్డీఓలకు స్వామి వార్ల శేష వస్త్రాలు అందించారు. వీటితో పాటు స్వామి వారి చిత్రపటాలు, ప్రసాదాలను అందజేశారు.

గణపతి హాలును పునర్నిర్మించాలి

కాజులూరు: కాకినాడ-కోటిపల్లి రహదారిలో గొల్లపాలెం మార్కెట్ జంక్షన్ వద్ద పన్నెండేళ్ల క్రితం తొలగించిన గణపతి హాలును అధికారులు తిరిగి పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. కరప, కాజులూరు మండలాల్లో 20 గ్రామాలకు కూడలి అయిన ఈ సెంటర్‌లో నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు బస్సులెక్కుతుంటారు. ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించే సమయాల్లో వీరికి సరైన షెల్టర్ సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. గతంలో గణపతి హాలు పేరుతో ఇక్కడ ఒక భవనం ఉండేది. ఇందులో కొంత భాగాన్ని కచేరి చావిడిగా వినియోగించగా కొంత భాగాన్ని ప్రయాణికులు విశ్రాంతి భవనంగా వినియోగించుకునేవారు. కచేరి చావిడిలో కళాకారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, స్థానికులు పలు సమావేశాలు నిర్వహించేవారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా 12 సంవత్సరాల క్రితం అధికారులు గణపతిహాలును తొలగించారు. కొన్నాళ్ల తర్వాత ఆ స్థలంలో స్థానిక ఐడియల్ యూత్ సభ్యులు ప్రయాణికుల కోసం తాటాకులతో పాక వేసి బస్సు షెల్టరుగా ఏర్పాటు చేశారు. క్రమేపీ అది శిథిలమయ్యింది. దీంతో ఇక్కడ బస్సు షెల్టరు లేక ప్రయాణికులు షాపుల అరుగుల పైనా దుకాణాల ఎదుట నిల్చుని ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తుంది. మరో పక్క గణపతిహాలు స్థలం క్రమేపీ ఆక్రమణలకు గురౌతుంది. అధికారులు స్పందించి ఈ జంక్షన్‌లో గణపతిహాలు నిర్మించాలని స్థానికులు ఏడిద నాని, కంచుస్తంభం బుజ్జి, అంగర శ్రీను తదితరులు కోరుతున్నారు.



గొల్లపాలెంలో గణపతి హాలు తొలగించిన ప్రాంతం

హిందువులకు రాహుల్ క్షమాపణ చెప్పాలి



రాయవరం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, ధర్మవీర్ నేతలు

రాయవరం: లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఉంటూ హిందువులను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలపై రాహుల్‌గాంధీ బహిరంగ క్షమాపణలు చెప్పాలని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, ధర్మవీర్ నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, ధర్మవీర్ నాయకులు జీవీ రమణ, ఎన్.రామకృష్ణారెడ్డి, చాట్రాతి జానకి రాంబాబు, నరాల రాంబాబు తదితరులు ఈ మేరకు రాయవరం తహసీల్దారు ఆర్‌వీ కృష్ణారావుకు ఒక వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా రాహుల్‌గాంధీ మాట్లాడారన్నారు. ప్రతిపక్ష నేతగా లోక్‌సభలో బాధ్యతాయుతంగా మాట్లాడాల్సిన రాహుల్ గాంధీ మాట్లాడిన మాటలను యావత్ హిందూ జాతి తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. హిందువులు అవమానపర్చేలా మాట్లాడిన రాహుల్‌గాంధీ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని రాష్ట్రపతి వెంటనే రద్దు చేయాలని వారు వినతిపత్రంలో కోరారు.

సంపూర్ణ పారిశుధ్యంతోనే డెంగీ నివారణ

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పి డెంగీ వంటి వ్యాధులను పూర్తిగా నిర్మూలించాలని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, ఆర్.మల్లికార్జున, డి.సాయికిషోర్ కోరారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా పీహెచ్‌సీలతో పాటు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల్లో శనివారం భారీ ర్యాలీలు నిర్వహించారు. ఈనెల ఒకటి నుంచి 31 వరకూ నిర్వహించే డెంగీ వ్యాధి వ్యతిరేక మాసోత్సవాల ఆవశ్యకతను ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు వైద్యసేవలను పర్యవేక్షించారు.

రసాయనం.. అతిగా వాడితే అనర్థం

- మందుల పిచికారీలో జాగ్రత్తలు అవసరం
- మోతాదుకు మించితే దిగుబడికే నష్టం



మొసలపల్లిలో పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న కూలీలు (ఫైల్)

అంబాజీపేట: ఆధునిక టెక్నాలజీ పెరుగుతున్నా... వ్యవసాయం మాత్రం వ్యయసాయంగా మారింది. రైతులు సరికొత్త పద్ధతుల్లో పంటల సాగు చేయడంతో రసాయన మందుల వినియోగం కూడా రోజురోజుకూ పెరిగిపోతోంది. విత్తనాలు చల్లడం నుంచి పంట కోతకు వచ్చే వరకూ పురుగుమందుల వాడకంపై రైతులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలి. లేని పక్షంలో పంట దిగుబడి దెబ్బతినడంతో పాటు రైతు నష్టాల బారిన పడాల్సి వస్తుంది. అధికంగా పురుగు మందులు వినియోగిస్తే ప్రమాదమని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. మోతాదుకు మంచి రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగిస్తే పంటపై ప్రభావం పడుతుందని, తప్పకుండా రైతులు వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనలు పాటించాలని తెలియజేస్తున్నారు. 25 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న సమయంలో వంటలకు పిచికారీ చేయాలి. రైతులు పలు జాగ్రత్తలు తీసుకుని పిచికారీ చేస్తే ప్రమాదాల నుంచి గట్టెక్కవచ్చని ఇటు వైద్యులు, అటు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మూడు నియోజకవర్గాలకు సంబంధించి పి.గన్నవరంలో 25,382, కొత్తపేటలో 34,702, రాజోలులో 8,650 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.

రసాయనాలు పిచికారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గాలికి ఎదురుగా రసాయన మందులు పిచికారీ చేయరాదు. తెగులు మందు, పురుగుమందు కలి పి పిచికారీ చేయరాదు. చేతలకు గ్లౌజులు, నోరు, ముక్కుకు మాస్కులు వేసుకోవాలి. మందులు పిచికారీ చేసే సమయంలో కళ్లు, ముక్కు, నోరు, చేతులతో రుద్దుకోరాదు. వాడిన పురుగు మందుల డబ్బాలు ఎక్కడపడితే అక్కడ వేయరాదు. రసాయన మందులు పిచికారీ సమయంలో స్ప్రేయర్లకు లీకేజీ ఉండరాదు. ద్రావణం కలిపే మందు డబ్బాపై సూచించిన మేరకు గానీ, వ్యవసాయ అధికారులు సూచించిన మేరకు గానీ పిచికారీ చేయాలి. పిచికారీ చేసే సమయంలో బీడీలు, సిగరెట్లు తాగరాదు. భోజనానికి ముందు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. రసాయన మందు పిచికారీ చేసే సమయంలో కడుపుమంట, దద్దుర్లు వస్తే సమీపంలో ఉన్న వైద్యుడిని సంప్రదించాలి.